సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం ‌। 1 । ఫిబ్రవరి । 2025



పద్మాపురంలో హాట్ ఎయిర్ బెలూన్, (ఇన్‌సెట్) పారా గ్లైడింగ్ చేస్తున్న పూణేకు చెందిన యువతి

ఆరంభం అదుర్స్

- గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా అరకు చలి ఉత్సవ్
- 5కె రన్ మారథాన్ పోటీలతో ఉత్సాహంగా ప్రారంభం
- మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న పర్యాటకులు, స్థానికులు
- ఉత్సవ్‌ను ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్
- ఫిబ్రవరి 2 వరకు కొనసాగనున్న కార్యక్రమాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పద్మాపురం గార్డెన్‌లో ఆకట్టుకున్న ఫ్లవర్ షో
- ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్ రైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్, పారా గ్లైడింగ్

ఆరంభం అదిరింది.. మూడు రోజుల పాటు జరిగే అరకు చలి ఉత్సవ్–2025 శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవ్‌ను కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అరకు హోరెత్తింది. పారా గ్లైడింగ్, ఎయిర్ బెలూన్, హెలికాప్టర్ రైడింగ్, పద్మాపురం గార్డెన్‌లో ఫ్లవర్ షో, అరకులోయ రవ్వలగూడ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఆదివాసీల వంటకాల ఫుడ్ ఫెస్ట్, వివిధ రాష్ట్రాల గిరిజన కళాకారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రా ఊటీ అరకులోయలో చలి ఉత్సవ్ ఆరంభం అదిరింది. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా 'అరకు చలి ఉత్సవ్' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 7.30 గంటలకు 5కె రన్ మారథాన్ పోటీలతో కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఉత్సవ్‌ను ప్రారంభించారు. అరకులోయ రవ్వలగూడ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన 5కె రన్ మారథాన్‌లో పర్యాటకులు, స్థానిక గిరిజన యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. ఈ ఉత్సవ్‌లో పారా గ్లైడింగ్, ఎయిర్ బెలూన్, హెలికాప్టర్ రైడింగ్, పద్మాపురం గార్డెన్‌లో ఫ్లవర్ షో, అరకులోయలో రవ్వలగూడ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఆదివాసీల వంటకాల ఫుడ్ ఫెస్ట్, వివిధ రాష్ట్రాల గిరిజన కళాకారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముందుగానే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న పర్యాటకులు హెలికాప్టర్‌లో గగనతలం నుంచి మన్యంలో అందాలను వీక్షించారు. సాయంత్రం 6 గంటల నుంచి ప్రదర్శించిన సంప్రదాయ గిరిజన నృత్యాలైన థింసా, నగరభేరి, కూచిపూడి, జముకు పాట, బస్తర్ బ్యాండ్, తోడా డ్యాన్స్, గోండ్ ట్రైబల్ డ్యాన్స్, డప్పు వాయిద్యాల డ్యాన్స్, ఆదివాసీ యువత చేసిన తీన్‌మార్, కొమ్ముకాయి, సవర, జాతపు, మణిపూర్ డ్యాన్స్, తప్పెటగుళ్ల నృత్యాలు అలరించాయి. అరకు వింటర్ ఫెస్టివల్ తొలి రోజు 5 వేల మంది వరకూ సందర్శకులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చినట్టు అధికారులు అంచనా వేశారు. రెండో రోజు, మూడో రోజు వీకెండ్స్ కావడంతో కనీసం 10 వేల నుంచి 20 వేల మంది వరకూ పర్యాటకులు రావచ్చని భావిస్తున్నారు. ఈ ఉత్సవ్ 2వ తేదీ వరకూ కొనసాగుతుంది.

ఐఏఎస్, ఐపీఎస్‌ల స్టెప్‌లు..

అరకు చలి ఉత్సవంలో భాగంగా సాయంత్రం ట్రైబల్ మ్యూజియంలో ఐఏఎస్, ఐపీఎస్‌లు డ్యాన్స్‌లు వేశారు. కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, అడిషనల్ ఎస్పీ ధీరజ్, మహిళా అధికారులు ఎర్రటి వస్త్రాలను తలపాగాలు కట్టుకుని స్టెప్‌లు వేశారు. డ్యాన్స్‌లో పలువురు అధికారులు, స్థానిక గిరిజన యువత, సందర్శకులు జతకలిశారు.

హాట్ ఎయిర్ బెలూన్.. పారా గ్లైడింగ్

ఈ ఉత్సవ్ సందర్భంగా పద్మాపురం గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన హాట్ ఎయిర్ బెలూన్, మాడగడ వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన పారా గ్లైడింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిచాయి. హాట్ ఎయిర్ బెలూన్‌కు ఒకరికి రూ.1800 చొప్పున టికెట్ ధర నిర్ణయించారు. హాట్ ఎయిర్ బెలూన్ ఎక్కేందుకు ఉత్సవ్‌లో తొలిరోజు పర్యాటకులు క్యూ కట్టారు. మాడగడ వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన పారా గ్లైడింగ్‌ను కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. పూణేలో ప్రైవేట్ సంస్థకు చెందిన ఈ పారా గ్లైడింగ్ బృందం ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నారు. పర్యాటకులెవరికీ పారా గ్లైడింగ్‌చేసేందుకు అవకాశం ఇవ్వలేదు.

తొలిసారిగా హెలికాప్టర్ రైడ్..

ఉత్సవ్‌లో భాగంగా తొలిసారిగా ప్రైవేటు భాగస్వామ్యంతో అందుబాటులోకి తెచ్చిన హెలికాప్టర్ రైడ్ పర్యాటకులకు తెగ నచ్చేసింది. ఆన్‌లైన్‌లో, నేరుగా బుక్ చేసుకున్న 150 మంది వరకూ సందర్శకులు తొలిరోజు హెలికాప్టర్ ఎక్కారు. మంచు ప్రభావం ఎక్కువగా ఉండడంతో 10.30 గంటలకు వరకూ హెలికాప్టర్ రైడింగ్ చేయలేదు. వాతావరణం అనుకూలించిన తరువాత నుంచి సాయంత్రం 4.30 వరకూ హెలికాప్టర్ రైడింగ్ నిర్వహించారు. ధర ఎక్కువైనా ఎక్కడా పర్యాటకులు తగ్గేదేలేదంటూ రైడింగ్‌కు ఆసక్తి చూపారు.

అలరించిన ఫ్లవర్ షో

అరకు వింటర్ ఉత్సవాల సందర్భంగా పద్మాపురం గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఫ్లవర్ షో ఆకర్షించింది. ఐటీడీఏ, హార్టికల్చర్ సంయుక్తంగా ఈ షోను ఏర్పాటుచేశాయి. కడియం, విశాఖపట్నం నుంచి 10 వేలకు పైగా పెద్ద చామంతులు, 5 వేలకు పైగా గులాబీలు, ఏజెన్సీ వాతావరణానికి అనుకూలంగా ఉన్న ఆర్కిడ్స్, బంతి, జరబరాలు పువ్వులు ప్రత్యేకంగా తీసుకువచ్చారు. మొత్తం 15 రకాల పువ్వులను ఏర్పాటు చేశారు. కూరగాయలు, జామ, ఇతర పండ్లతో తయారు చేసిన తాబేలు, షిప్, ట్రైన్, చక్రం, గుమ్మడి కాయలతో తయారు చేసిన పడవ తదితర ఆకారాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సుమారు రూ.15 లక్షలు వెచ్చించి విద్యుత్ కాంతులతో ఆకట్టుకునేలా ప్రదర్శనను తీర్చిదిద్దారు.

ఆకట్టుకున్న 25 రకాల స్టాళ్లు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 25 రకాల స్టాళ్లు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. ఆదివాసీలు పండించే వివిధ రకాల ఉత్పత్తులు, గిరిజన సంప్రదాయ వస్తువులు, జీసీసీ ఉత్పత్తులు, చిరు ధాన్యాలు, నాగాలాండ్‌కు చెందిన ఉన్ని వస్త్రాలు, ఊటీ నుంచి తెచ్చిన నీలగిరి టీ, పెర్ఫ్యూమ్స్, ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి నుంచి బొండవాలి, మణిపూర్ నుంచి హ్యాండీ క్రాఫ్ట్, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి సవరా ఆర్ట్స్, విజయవాడ నుంచి ఆర్గానిక్ సీడ్స్, చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి బస్తర్ ఫేమస్ ఆభరణాలు, వెదురు ఫ్లవర్ బొకేలు, గిరిజన సంప్రదాయ దండలు, బ్యాగులతో 25 రకాల స్టాళ్లను ప్రత్యేకంగా నిలిచాయి. ట్రైబల్ మ్యూజియంలో వలే పూరిగుడిసెలో సంప్రదాయ వేషధారణలో నివసించే గిరిజనుల సంస్కృతిని తెలియజేసేలా స్టాల్ ఏర్పాటు చేశారు.

ఆహా.. ఏమి రుచి

అరకు చలి ఉత్సవాల్లో గిరిజన వంటకాలు ఆహా అనిపించాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటకాలు సందర్శకులకు తెగ నచ్చేశాయి. వీటిలో రాగి పిండితో తయారు చేసిన అంబలి(రాగి జావ), తోప(రాగి సంగటి), సామ, కొర్రల బియ్యంతో అన్నం, రాజ్‌మా, కందులు, బొబ్బర్లు (అలసందలు) తదితర గిరిజన వ్యవసాయ ఉత్పత్తులతో తయారుచేసిన వంటకాలు సందర్శకులను కట్టిపడేశాయి. రాగి బెల్లం పిట్టు, కందుల పిట్టు, అలసందల కిచిడీ, రాగి తోప, రాగి అంబలి, రాగి బెల్లం ఉండలు, సామ బియ్యం అన్నం, రాజ్‌మా కూర, వెదుర కొమ్ముల కూర, శంకర లడ్డు, రాగి కుడుము, రాగి సక్కు, కర్ర పెండలం దుంపలు, రాజ్‌మా పిక్కలతో చేసిన రాబా, సారాకుల కూరతో రాబా, కొర్రల బియ్యం పాయసం, చిలగడ దుంపలు, గుమ్మడి ఆకుల కూర, పిండి దుంపల కూర, అడ్డ పిక్కలు, హల్వా ఆహా అనిపించాయి.





కొమ్ము డ్యాన్స్ కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



కూరగాయలతో తయారు చేసిన నమూనాను తిలకిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్





ఉత్సవ్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లు



ప్రతిమను తిలకిస్తున్న గిరిజనుడు



డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్ట్‌లో గిరిజన వంటకాలతో మహిళలు

అరకు ఉత్సవం.. అభివృద్ధికి దోహదం

కలెక్టర్ దినేష్‌కుమార్

అరకులోయ టౌన్/డుంబ్రిగుడ: అరకులోయ చలి ఉత్సవాలు గిరిజన ప్రాంత అభివృద్ధికి దోహదపడతాయని కలెక్టర్ ఎ.ఎస్ దినేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు అరకు రైల్వే స్టేషన్ వద్ద 5కె మారథాన్ రన్‌ను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. విజేతలకు బహుమతులతో పాటు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సేటు నో డ్రగ్స్ పోస్టర్‌ను జేసీ అభిషేక్ గౌడ్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, ఏఎస్పీ ధీరజ్‌లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద కలెక్టర్ దినేష్‌కుమార్ పారా గ్లైడింగ్‌ను ప్రారంభించారు. సాయంత్రం ధంకా మోగించి, ఉట్టిలో ధాన్యం, నీరు పోసి, ఒడ్లు దంచి స్టాళ్లను ప్రారంభించారు.

పూణేలోని ఆరెంజ్‌లైఫ్ పారా గ్లైడింగ్ పాఠశాల నుంచి వచ్చిన పైలట్ ఆలీషా ద్వారా మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద పారా గ్లైడింగ్‌ను ప్రారంభించారు. అనంతరం డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో స్టాళ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 5కె రన్‌లో 300 మంది పాల్గొన్నట్టు చెప్పారు. ఈఉత్సవాలకు హాజరైన ప్రజల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.



ధంకా మోగించి ఉత్సవాలు ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

5కె రన్‌లో విజేతలు వీరే..

5కె రన్‌లో పురుషుల విభాగంలో వి.రమేష్ ప్రథమ స్థానం, డి.అభిషేక్ ద్వితీయ స్థానం, శామ్యూల్ తృతీయస్థానంలో నిలిచారు. విద్యార్థినుల విభాగంలో జీవన తన్య ప్రథమస్థానం, ఎస్.మంజుల ద్వితీయస్థానంలో నిలిచారు. వీరికి కలెక్టర్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.



మారథాన్‌రన్ విజేతలతో కలెక్టర్ దినేష్‌కుమార్

500 మందితో బందోబస్తు

అరకులోయ పరిసర ప్రాంతాల్లో సుమారు ఐదు కిలో మీటర్ల పరిధిలో ఐదు వందల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మారథాన్ 5కె రన్ ప్రారంభమైన అరకు రైల్వే స్టేషన్ నుంచి ఉత్సవ్ వేదిక వరకు ఏఎస్పీ ధీరజ్ ఆదేశాల మేరకు అరకులోయ సీఐ ఎల్.హిమగిరి పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.



స్టాల్‌లో పూసల దండలను చూస్తున్న యువతులు



జబర్దస్త్ నవీన్, తాగుబోతు రాజమౌళి బృందం



పాట పాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్, సింగర్ ఎంఎం శ్రీలేఖ



సాంస్కృతిక కార్యక్రమం



కూరగాయలతో ...

అరకు చలి ఉత్సవ్‌తో ఒరిగేదేమీ లేదు

ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, రేగం మత్స్య లింగం

డుంబ్రిగుడ : అరకులోయ చలి ఉత్సవ్ వల్ల గిరిజనులకు ఒరిగేదేమీ లేదని, కోట్లాదిరూపాయల ప్రజాధనాన్ని కూటమి ప్రభుత్వం వృథా చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ఆదివాసీ ప్రాంతంలో 1/70 చట్ట సవరణ ద్వారానే ఏజెన్సీప్రాంతాల్లో పెట్టుబడులు వస్తాయని రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడడం బాధాకరమని చెప్పారు. అయ్యన్న వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేసేందుకు అరకులోయ వస్తుండగా మార్గ మధ్యంలో జైపూర్ జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యేలు రోడ్డుపైనే బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన చట్టాలను పటిష్టంగా అమలుపరిచి, విద్య, వైద్యం, యువతకు ఉపాధి అవకాశాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే ఏ ఉత్సవాలైనా నిర్వహించాలని తెలిపారు. చలి ఉత్సవాల సందర్భంగా వినోదం అందించేందుకు ఏర్పాటుచేసిన హెలికాప్టర్‌లో ప్రయాణించడానికి ఒక్కొక్కరి నుంచి రూ.4,000 చార్జీ వసూలు చేయడం దారుణమన్నారు. వ్యాపారం కోసమే గిరిజన సంప్రదాయ ఉత్సవాల ముసుగులో అరకు చలి ఉత్సవ్‌ను నిర్వహిస్తున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి పాంగి చిన్నారావు, డుంబ్రిగుడ మండలం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరరావు, డుంబ్రిగుడ మండలం సర్పంచ్ కిముడు హరి, సర్పంచ్ ఒరబోయిన సుబ్బారావు, ఎంపీటీసీలు దురియా ఆనంద్,సమర్ది శత్రుగుణ, వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు తేడబారికి సురేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ బీసీ సెల్ అధ్యక్షుడు గెడ్డం నరసింగరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి జన్ని నరసింహమూర్తి, నాయకులు పాంగి పరశురామ్ , శెట్టి అప్పాలు,కూడ సుబ్రమణ్యం, జాని, బాబూరావు, రామమూర్తి, అర్జున్,బాలకృష్ణ,బొంజుబాబు ,గుడివాడ ప్రకాష్, నాగేష్, శివ, మోహన్ రావు, స్థానికులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

డీఎస్పీగా షెహబాజ్ అహ్మద్ బాధ్యతల స్వీకరణ



పాడేరు : పాడేరు డీఎస్పీగా ఎస్‌కే షెహబాజ్ అహ్మద్ శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎస్పీగా పని చేసిన కె.ప్రమోద్‌ను ఆళ్లగడ్డకు బదిలీ చేసి, చింతపల్లిలో డీఎస్పీగా పనిచేసిన ఎస్‌కే షెహబాజ్ అహ్మద్‌ను పాడేరుకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు జిల్లాలో గంజాయి సాగు, రవాణా నిర్మూలన, ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీని పాడేరు సీఐ డి.దీనబంధు మర్యాదపూర్వకంగా కలిశారు.

5న ఫీజు పోరు దీక్ష

- పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- విజయవంతం చేయాలని పిలుపు

పాడేరు : వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న నిర్వహించే ఫీజు పోరు కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి తన క్యాంప్ కార్యాలయంలో ఫీజు పోరు పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులకు ఏడాదికి రెండుసార్లు విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాలో నిధులు జమ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము విడుదల చేయకపోవడంతో నిరుపేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఇందుకు నిరసనగా ఈనెల 5న పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రమైన పాడేరులో ఫీజు పోరు పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, సర్పంచ్‌లు గొల్లోరి నీలకంఠం, కుర్రబోయిన సన్నిబాబు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు పాంగి నాగరాజు, కుంతూరు బొంజుబాబు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తమర్బ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు పలాసి రామారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు

క్లుప్తంగా

అరకు ఉత్సవ్‌లో పారా గ్లైడింగ్

• రైడర్ మనీష



అరకులోయ టౌన్: పూణేకు చెందిన కమిషనర్ ఆఫ్ పారా గ్లైడింగ్ ఎరోక్లబ్ ఆఫ్ ఇండియా విజయ సోని నేతృత్వంలో అరకు చలి ఉత్సవ్‌లో రైడింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద రైడింగ్ ఏర్పాటు చేశామన్నారు. పర్యాటక శాఖ ఆహ్వానం మేరకు అరకు చలి ఉత్సవ్‌లో పారా గ్లైడింగ్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వారం రోజుల క్రితం నిర్వహించిన ట్రయిల్ రన్ విజయవంతం కావడంతో ఉత్సవ్‌లో రైడింగ్ చేపట్టామన్నారు. అల్లూరి జిల్లా పర్యాటకంగా పుంతలు తొక్కుతుందన్నారు. ఈ ప్రాంతానికి భవిష్యత్తులో పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

బెల్టు షాపులను నియంత్రించాలి

విశాఖ సిటీ: ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎక్కడా బెల్టు షాపులు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏయూలో ఉత్తరాంధ్ర జిల్లాల ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో బెల్టు షాపుల లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. అలాగే ఎంఆర్‌పీకే మద్యం విక్రయాలు జరగాలని స్పష్టం చేశారు. గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై కూడా దృష్టి పెట్టాలన్నారు. ఏయూలో మద్యం నాణ్యతను తనిఖీ చేసే లేబొరేటరీని సందర్శించారు.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



చింతపల్లిలో కురుస్తున్న మంచు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. జి మాడుగులలో 9.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. సోమవారం నుంచి కనిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పటికీ ఉదయం వేళల్లో 9 గంటలు దాటినా మంచు వీడడంలేదు.పాడేరు డివిజన్ పరిధిలో జీకే వీధిలో 11.9 డిగ్రీలు,డుంబ్రిగుడలో 12.7 డిగ్రీలు, అనంతగిరిలో 13.5 డిగ్రీలు,పెదబయలులో 13.9 డిగ్రీలు,చింతపల్లిలో 14.5 డిగ్రీలు,హుకుంపేటలో 14.6 డిగ్రీలు, పాడేరులో 14.7 డిగ్రీలు,కొయ్యూరులో 14.7 నమోదు కాగా ముంచంగిపుట్టులో 15.2 డిగ్రీలు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు ఏడీఆర్ తెలిపారు.

అరకు చలి ఉత్సవ్ చిత్ర మాలిక





కూరగాయలతో తయారు చేసిన నమూనాలు



గిరిజనుల ఇంటి నమునా



ఫ్లవర్ స్టాల్



జెండా ఊపి 5కె రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



రన్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన జీవన తన్యను ఎత్తుకున్న కలెక్టర్ దినేష్‌కుమార్



5కే రన్‌కు సిద్ధం అంటు అభివాదం చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు



మాడగడ వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల సెల్ఫీ

నేటి నుంచి బాదుడే

• 15 నుంచి 131 శాతం భూముల విలువ పెంపు
• భారం కానున్న రిజిస్ట్రేషన్ చార్జీలు
• చివరి రోజు శుక్రవారం రెట్టింపు స్థాయిలో రిజిస్ట్రేషన్లు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న క్రయ విక్రయదారులు

విశాఖ సిటీ: విశాఖలో భూముల విలువ శనివారం నుంచి గణనీయంగా పెరగనుంది. మునుపెన్నడూ లేని విధంగా 15 శాతం నుంచి 131 శాతం వరకు భూముల విలువలను సవరించారు. దీంతో ఫ్లాట్లు, ప్లాట్లతో పాటు వ్యవసాయ భూములు కొనుగోలు చేసే వారిపై రిజిస్ట్రేషన్ చార్జీల భారం భారీగా పడనుంది. ఈ పెరిగిన ధరలు శనివారం నుంచి అమలులోకి రానున్నాయి. అధికారంలోకి వస్తే ఏ చార్జీలు పెంచబోమని అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వరుసగా ప్రజలపై భారాలు మోపుతూపోతోంది. రెండు నెలల క్రితమే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు షాక్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రిజిస్ట్రేషన్ చార్జీలను సైతం పెంచింది. ఇప్పటికే విశాఖలో భూములు ధరలు గరిష్ఠ స్థాయిలో ఉన్నాయి. శివారు ప్రాంతాల్లో సైతం గజం ధర రూ.30వేలు, రూ.40 వేలుగా ఉంది. ఇటువంటి తరుణంలో రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా భారీగా పెరగడంతో మధ్య తరగతి ప్రజలు సొంతింటిని కొనుగోలు చేయడం కష్టసాధ్యంగా మారనుంది. విశాఖలో భూముల విలువ సవరణల ద్వారా రూ.150 కోట్ల మేర ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

కిక్కిరిసిన కార్యాలయాలు

పెరిగిన రిజిస్ట్రేషన్ ధరలు శనివారం నుంచి అమలులోకి రానున్నాయి. 1వ తేదీ నుంచి అత్యల్పంగా 15 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగడంతో చివరి రోజు శుక్రవారమే చాలా మంది కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ల కోసం ఎగబడ్డారు. దీంతో అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. సాధారణ రోజుల్లో ఒక్కో కార్యాలయంలో 30 నుంచి 40 రిజిస్ట్రేషన్లు జరిగేవి. కానీ భూముల విలువ పెరగడంతో చివరి రెండు రోజులు రోజుకు 60 నుంచి 70 రిజిస్ట్రేషన్లు జరిగాయి. శుక్రవారం కూడా అదే స్థాయిలో క్రయ, విక్రయదారులతో కార్యాలయాలు కిక్కిరిసిపోయాయి. రాత్రి 10 గంటల తరువాత కూడా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు జరగడం విశేషం.

అటవీ అధికారుల అదుపులో టీడీపీ నేత?

గొలుగొండ: కరక రంగురాళ్ల క్వారీ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న సాలికమల్లవరానికి చెందిన కీలక టీడీపీ నేతను అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కరక, సాలికమల్లవరం, పప్పుశెట్టిపాలెం ప్రాంతాల్లో రంగురాళ్లు తవ్వేందుకు అనుమతుల కోసం కొంత మంది దరఖాస్తులు చేసుకున్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత క్వారీ అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించడం కోసం కొంతమంది స్థానిక టీడీపీ నాయకులను ఇతర ప్రాంతాలకు చెందిన వారు సహాయం కోరటం జరిగింది. అలా క్వారీ ప్రాంతంలో సంచరించిన వ్యక్తులను 144 సెక్షన్ అమల్లో ఉన్న కారణంగా అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డీఎఫ్‌వో ఎం.శామ్యూల్‌ను సంప్రదించగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గిన్నెలకోటలో ఇంటింటా సర్వే

• ఐదు గ్రామాల్లో చర్మవ్యాధులు సోకిన 66 మంది గుర్తింపు
• డీఎంహెచ్‌వో జమాల్ బాషా



పిల్లలకు పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఎవో

పెదబయలు: రూడకోట పీహెచ్‌సీ పరిధిలోని గిన్నెలకోట పంచాయతీలో మూడు వైద్య బృందాలు ఇంటింటా సర్వే పూర్తి చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా తెలిపారు. చర్మ వ్యాధులు ప్రబలిన గిన్నెలకోట, ఇనుపతీగలు, లందూలు, పెద్దపాడు, గొచ్చంగి గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించి, ప్రస్తుతం పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు. ఇంటింటా సర్వేపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రూడకోట పీహెచ్‌సీ పరిధిలో 23,526 మంది జనాభా ఉన్నారని గిన్నెలకోట పంచాయతీలో 2,630 మంది జనాభా ఉన్నారని చెప్పారు. 607 ఇళ్లకు మూడు వైద్య బృందాలతో ఇంటింటా సర్వే చేయిస్తున్నట్టు తెలిపారు. చర్మవ్యాధులు సోకిన 66 పిల్లలను గుర్తించినట్టు చెప్పారు. వీరిలో 32 మందిని పాడేరు జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. వీరిలో ఇద్దరిని విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు తెలిపారు. 66 మంది పిల్లల్లో 9 నెలల వయస్సు నుంచి ఐదేళ్ల వయస్సులోపు పిల్లలు 36 మంది, ఐదేళ్ల పైబడిన పిల్లలు 29 మంది ఉన్నారని చెప్పారు. తొమ్మిది నెలల కంటే తక్కువ వయస్సు ఉన్న శిశువు ఒకరన్నారు. 32 మంది పిల్లలకు ప్రత్యేక వైద్యం అందిస్తున్నామని, అందరూ రికవరీ అవుతున్నారని చెప్పారు. వ్యాధి అదుపులోకి వచ్చే వరకూ గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. డీపీహెచ్‌ఎన్‌వో భూలోకమ్మ, వైద్యాధికారి సత్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి

మాకవరపాలెం : బైక్ ప్రమాదంలో ప్రైవేటు బస్సు డ్రైవర్ మృతి చెందాడు. లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన రొంగల సతీష్(25) నర్సీపట్నం ఆర్టీసీ డిపోలో హైయర్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఈ గ్రామంలో గౌరీ పరమేశ్వరుల తీర్థ మహోత్సవం కావడంతో ఇంటి వద్దే ఉన్నాడు. ఇంటి నుంచి బైక్‌పై వేరే వీధిలోకి వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను తప్పించే క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో సతీష్ తలకు తీవ్రగాయాలుకాగా వెనుక కూర్చున్న అనంత్‌కు కాలికి గాయాలయ్యాయి. సతీష్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. సతీష్ మృతితో గ్రామంలో విషాదం అలముకోగా, చేతికి అందివచ్చిన కొడుకు మరణం తల్లిదండ్రులకు తీరని వేదన మిగిల్చింది.

4వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు



మాట్లాడుతున్న ఏపీఓ రాజు

చింతపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 4 వేల ఎకరాల్లో ఉద్యాన వన పంటల పెంపకానికి రైతులను గుర్తించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ఏపీఓ రాజు తెలిపారు. స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుపై రైతులకు ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ వార్షిక సంవత్సరంలో ప్రధానంగా డ్రాగన్‌ఫ్రూట్, నిమ్మ, జామ, నారింజ, సపోటా, ఉసిరి, సీతాఫలంతో పాటు జీడిమామిడి మొక్కలు పెంపకానికి రైతులను ప్రోత్సహించనున్నట్టు చెప్పారు. ఈ సాగుపై ఆసక్తి ఉన్న రైతులను సిబ్బంది ఎంపిక చేస్తారన్నారు. ఒక్కో రైతు కనిష్టంగా అర ఎకరం నుంచి గరిష్టంగా ఎకరం వరకూ సాగుచేసుకోవచ్చన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. ఇప్పటికే 850 గృహాలను గుర్తించామని, మిగిలిన గృహాలను సర్వే చేపట్టనున్నట్టు చెప్పారు. మండలానికి 28 గోశాలలు మంజూరైనట్టు తెలిపారు.ఉపాధి పథకంలో కూలీలకు కేటాయించిన వంద రోజుల పని దినాలను మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు. టీఏలు, ఎస్ఏలు, వీఆర్‌పి పాల్గొన్నారు.

బడ్జెట్ రైలుబండి.. వాల్తేరులో ఆగేనా?



వాల్తేరు డివిజన్‌లో ఏటా బడ్జెట్ బండి కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. గంపెడు నిధులతో పరుగులు పెడుతూ వస్తున్నట్లు కనిపించినా..విత్త మంత్రి ప్రసంగం ముగిసిన తర్వాత చూస్తే.. రైలు వచ్చినట్లే వచ్చి బైపాస్‌లో మాయమైపోతోంది. దశాబ్దకాలంగా అరకొర నిధుల విదిలింపులతో వాల్తేరు పరిధిలో ప్రాజెక్టులు సా...గుతూనే ఉన్నాయి. ఉత్తరాంధ్ర వాసుల చిరకాల స్వప్నం దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన జరిగినా ఎలాంటి కదలిక లేకపోవడంతో మళ్లీ కథ మొదటికొచ్చింది. ఈసారైనా బడ్జెట్‌లో సంపూర్ణంగా నిధులు కేటాయింపులు చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

\- సాక్షి, విశాఖపట్నం

ఏటా బడ్జెట్‌లో వాల్తేరుకు అరకొర నిధులు

ప్రాజెక్టులు మంజూరు చేసినా నిధుల విషయంలో మీనమేషాలు

ఆగిపోయిన అనేక రైల్వే ప్రాజెక్టులు

జోన్‌కు శంకుస్థాపన జరిగి 20 రోజులు దాటినా పడని అడుగు

వాల్తేరు డివిజన్ కొనసాగింపుపై గంపెడాశలు పెట్టుకున్న ఉద్యోగులు

నేటి బడ్జెట్‌పై కోటి ఆశలు పెట్టుకున్న వాల్తేరు వాసులు

ప్రతిపాదనలు ఇచ్చారా ఎంపీ సారూ.?

ప్రతి బడ్జెట్‌కు ముందు.. ఆయా ఎంపీలు తమ పరిధిలో చేపట్టాల్సిన ప్రాజెక్టులు, కొత్త రైళ్ల మంజూరు మొదలైన ప్రతిపాదనలను రైల్వే మంత్రిత్వ శాఖకు అందిస్తారు. వాటిని సాధించేందుకు నిరంతరం రైల్వే బోర్డు అధికారులతో సంప్రదింపులు చేస్తారు. ఈసారి కూడా కూటమి ఎంపీలు ఒక్క ప్రతిపాదన కూడా రైల్వే మంత్రికి అందించలేదని తెలుస్తోంది. బడ్జెట్ సమయంలో మంజూరు కాకపోతే కొత్త ప్రాజెక్టులు పట్టాలెక్కడం అసాధ్యమని తెలిసినా.. కూటమి ప్రభుత్వ ఎంపీల్లో ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం.

‘జోన్’ కథ కొనసాగుతోందంతే.!

డీపీఆర్ అందించిన నాలుగేళ్ల తర్వాత జోన్ నిర్మాణానికి రూ.9 కోట్లు కేటాయించారంటే.. ఉత్తరాంధ్ర ప్రజల సెంటిమెంట్‌పై కేంద్రానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో స్పష్టమవుతోంది. ఓవైపు ప్రధాని మోదీ వచ్చి.. అట్టహాసంగా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన కూడా చేసేశారు. మరోవైపు జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రూ.149.16 కోట్లతో గతేడాది నవంబర్ 23న టెండర్లు కూడా పిలిచారు. అయితే ఈ టెండర్ల ప్రక్రియ గడువు ముగిసి నెల రోజులు గడుస్తున్నా దానిపై ఏ మాత్రం సమాచారం లేదు. ఈ బడ్జెట్‌లోనైనా పూర్తిస్థాయి నిధులు విడుదల చేస్తే తప్ప.. జోన్ కార్యాలయ నిర్మాణానికి అడుగులు పడే సూచనలు కనిపించడం లేదు.

స్టేషన్లలో సమస్యల సవారీ..



ప్లాట్‌ఫామ్‌పైనే నిద్రిస్తున్న ప్రయాణికులు

వాల్తేరు పరిధిలో 100 శాతం ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న రైల్వే అధికారులు.. ప్రయాణికుల మౌలిక సదుపాయాలపై మాత్రం పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. రద్దీ పెరిగితే చాలు ప్రయాణికుల యాతన అంతా ఇంతా కాదు. ప్లాట్‌ఫారాలపైనే పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఇంకా ఇక్కడ కొనసాగుతోంది. మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లో చీకటి పడితే చాలు ఏ రైలు వస్తుందో తాము ఎక్కడ ఉన్నామో కూడా అర్థం కాని దుస్థితి దాపురించింది. దువ్వాడలో దారుణమైన పరిస్థితులున్నాయి.

వాల్తేరు బంధంపై సందిగ్ధత వీడేనా.?

తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు వాల్తేరు డివిజన్ బంగారు బాతుగుడ్డు లాంటి ఆదాయాన్ని తెచ్చిపెట్టే అతిపెద్ద డివిజన్ వాల్తేరు. జోన్‌కు ఏటా దాదాపు రూ. 15 వేల కోట్లు ఆదాయం కాగా, ఇందులో రూ.8 వేల కోట్లు వరకూ వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. ఇప్పుడు ఇదంతా దాదాపు రాయగడ డివిజన్‌కు సొంతమవుతుంది. మనకు రావాల్సిన ఆదాయం దాదాపు సింహభాగం కోల్పోయినట్లే అవుతుంది. ఈ నేపథ్యంలో వాల్తేరు కొనసాగించాలంటూ రైల్వే ఉద్యోగులే ఉద్యమ బాట పట్టారు. డివిజన్ విడిపోతే 80 శాతం మంది ఉద్యోగులు ఇతర రాష్ట్రంపరిధిలోకి వెళ్లిపోతారు. అందుకే విశాఖ నుంచి పలాస వరకూ 200 కిమీ, కోనేరు వరకూ 160 కిమీ, అరకు వరకూ 130 కిమీ, విశాఖ నుంచి కాకినాడ, సామర్లకోట జంక్షన్, ద్వారపూడి వరకూ 180 కిమీ వరకూ వాల్తేరు డివిజన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజలు కోరుకుంటున్న వేంటంటే...



• విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల విస్తరణ ఎంతో అవసరం. అదనపు ప్లాట్‌ఫారాలు లేకపోవడంతో ఔటర్‌లో గంటల తరబడి రైళ్లు నిలిచిపోతున్నాయి.
• రూ.76 కోట్లతో మర్రిపాలెం స్టేషన్ అభివృద్ధి పనులు ఐదేళ్ల క్రితం నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. గోపాలపట్నం– మర్రిపాలెం మధ్య రెండు ప్రధాన లైన్లతో పాటు లూప్‌లైన్లు ఏర్పాటు కానున్నాయి. ఇవి ఏర్పాటైతే వైజాగ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా మర్రిపాలెం అభివృద్ధి చెందుతుంది. కానీ నిధుల మంజూరు విషయంలో జాప్యం జరుగుతుండటంతో ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇవి పూర్తయితే వైజాగ్‌కు రాకుండా దువ్వాడ నుంచి బైపాస్ మీదుగా వెళ్లిపోతున్న 15 వరకూ రైళ్లు.. ఇక్కడికి వచ్చే అవకాశాలున్నాయి.
• రూ.159.47 కోట్లతో విశాఖ–గోపాలపట్నం మధ్య 15.31 కిమీ మేర 3వ, 4వ లైన్లు నిర్మాణ పనులు పూర్తి కావాలి. వాస్తవానికి ఈ ప్రాజెక్టు డీపీఆర్ ఇచ్చి ఐదేళ్లు గడిచినా పనులు కాంట్రాక్టు సంస్థకు అప్పగించే పనిలోనే కాలం గడిచిపోతోంది.
• దువ్వాడ నుంచి ఉత్తర సింహాచలం వరకూ 20.54 కిమీ మేర రూ.92.62 కోట్లతో లైను అభివృద్ధి ప్రాజెక్టు మంజూరైనా.. ఇప్పటి వరకూ కేవలం రూ.8 కోట్లు మాత్రమే ఇచ్చారు. దీంతో రెండేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు మరో రెండేళ్లు పట్టే సూచనలు కనిపిస్తున్నాయి.